జిల్లాలో 87 శాతం సర్వే పూర్తి

- అదనపు కలెక్టర్ రాంబాబు

నేరేడుచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న జిల్లా అదనపు కలెక్టర్ రాంబాబు

నేరేడుచర్ల, నవంబర్ 21: ఇంటింటి సర్వే సూర్యాపేట జిల్లాలో ఇప్పటి వరకు 87 శాతం పూర్తయిందని జిల్లా అదనపు కలెక్టర్ పర్సు రాంబాబు తెలిపారు. గురువారం నేరేడుచర్ల తాసీల్దార్ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సర్వేలో సూర్యాపేట జిల్లా ఐదో స్థానంలో ఉందని తెలిపారు. సర్వే వివరాల డాటా ఎంట్రీ ప్రారంభమైందని తెలిపారు. ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి గృహాల సర్వేను మరో రెండు లేదా మూడ్రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డాటా ఎంట్రీ గదిని పరిశీలించారు. ఇంటి పన్ను వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మున్సిపల్ కమిషనర్ అశోక్ రెడ్డికి, ఎంపీడీవో సోమసుందర్ రెడ్డికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురగి సైదులు, డిప్యూటీ తహసీల్దార్ మౌనిక, ఎంపీవో హరిసింగ్, ఆర్ఐ నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అదనపు కలెక్టర్‌కు వినతి

గురుకుల పాఠశాలలు, సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ నాయకుడు రాపోలు నవీన్ అదనపు కలెక్టర్ రాంబాబుకు తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం ఇచ్చారు.

అంజిరెడ్డికి మాజీ ఎంపీ బడుగుల పరామర్శ

కామేశ్వరమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బడుగుల లింగయ్య యాదవ్

పాలకవీడు, నవంబర్ 21: బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కిష్టిపాటి అంజిరెడ్డి తల్లి కామేశ్వరమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా, మాజీ ఎంపీ, బీఆర్ఎస్ పార్టీ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్య యాదవ్ గురువారం మండలంలోని గుడుగుంట్లపాలెం గ్రామంలో కామేశ్వరమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంజిరెడ్డిని, కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో నేరేడుచర్ల బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అరిబండి సురేష్‌బాబు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ అనంతుల శ్రీను, కిష్టిపాటి శంభిరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి'

చిలుకూరు, నవంబర్ 21: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ చూపాలని ఎస్సై రాంబాబు అన్నారు. గురువారం బేతవోలు జిల్లా పరిషత్ పాఠశాలలో మత్తు పదార్థాల వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మత్తుకు బానిసలై జీవితాలను ఆగమం చేసుకోవద్దని సూచించారు. అనంతరం షీ టీమ్‌లపై అవగాహన కల్పించారు. ఏఎస్సై వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి: విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను చేరుకోవాలని గరిడేపల్లి ఎస్సై నరేష్ అన్నారు. గురువారం మండలంలోని గడ్డిపల్లి ఆదర్శ పాఠశాల, కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ జె.ప్రసన్నకుమారి అధ్యక్షతన 'మత్తు మందుకు దూరంగా ఉందాం – మంచి భవిష్యత్‌ను నిర్మించుకుందాం' అనే కార్యక్రమం నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండి పుస్తకాలకు దగ్గరవ్వాలన్నారు.

సరైన చికిత్సతో క్షయ వ్యాధిని నివారించొచ్చు

- ఎంపీహెచ్ఈవో శ్రీనివాసులు

పెన్‌పహాడ్, నవంబర్ 21: క్షయ నివారించదగిన వ్యాధేనని ఎంపీహెచ్ఈవో బి.శ్రీనివాసులు అన్నారు. గురువారం గాజుల మల్కాపురం గ్రామంలోని పల్లె దవాఖాన వద్ద క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షల క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ.. క్షయ వ్యాధికి సరైన చికిత్స పొందితే ప్రాణాపాయం నుంచి బయటపడొచ్చని అన్నారు. క్షయ వ్యాధిగ్రస్తులు దగ్గినప్పుడు, తుమ్మినప్పుడు నోటి ద్వారా బయటకు వచ్చే వ్యాధికారక మైక్రో బ్యాక్టీరియా ఇతరుల్లోకి ప్రవేశిస్తుందని, తద్వారా వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి సోకే అవకాశాలు ఎక్కువ అని తెలిపారు. ఈ క్యాంపులో 16 మంది అనుమానితులను గుర్తించి వారి నుంచి నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపించినట్లు వెల్లడించారు. హెచ్ఏ ప్రేమ్‌కుమార్, ఎల్‌టీ ఎల్.రాజు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

సూర్యాపేట అర్బన్, నవంబర్ 21: ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సూర్యాపేట డిపో మేనేజర్‌కు సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, కార్యదర్శి బత్తుల సుధాకర్ మాట్లాడుతూ..సిబ్బంది 14 గంటలు డ్యూటీ చేయడం ఇబ్బందిగా ఉందని, వెంటనే సవరించి లంచ్ టైం కల్పించి రెస్ట్ టైం తగ్గించాలని అన్నారు. కార్మికులపై వస్తున్న ఫిర్యాదులపై విచారణ చేయకుండా ఇబ్బందులకు గురి చేయడం సరికాదని, అలాంటి ఫిర్యాదులపై విచారణ చేసి నిర్ణయాలు తీసుకోవాలని కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఉప్పు లక్ష్మయ్య, సురేష్, ఆర్టీసీ కార్మికులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే కిశోర్‌ను విమర్శించే స్థాయి ప్రీతమ్‌కు లేదు

- బీఆర్ఎస్ నాయకుడు పరశురామ్

తుంగతుర్తి, నవంబర్ 21: అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న తుంగతుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గాదరి కిశోర్‌కుమార్‌ను విమర్శించే స్థాయి రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతమ్‌కు లేదని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా తుంగతుర్తి మండల కోఆర్డినేటర్ పుల్లూరి పరశురామ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ కాళేశ్వరం జలాలతో నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేసి రైతాంగాన్ని ఆదుకున్నారని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను ఒప్పించి తిరుమలగిరి మండలానికి దళిత బంధు పథకం తీసుకొచ్చి 3 వేల మంది దళిత కుటుంబాల ఆర్థికాభివృద్ధికి కృషి చేసిన ఘనత కిశోర్‌కే దక్కిందన్నారు. ప్రీతమ్‌కు చేతనైతే ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్‌గా నియోజకవర్గంలోని దళితుల అభ్యున్నతికి ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

మెమో పోయినది
దేవులపల్లి శైలజ, D/o. కృష్ణ, గ్రామం వాయిల సింగారం అనంతగిరి మండలం సూర్యాపేట జిల్లా అను పేరుగల SSC మెమో వాయల సింగారం నుండి అనంతగిరి మీదుగా కోదాడ వెళుతుండగా పోయినది. దొరికినవారు సంప్రదించగలరు.
9010253259

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం...
మన "నమస్తే తెలంగాణ" క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం...
ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
5% GST అదనం
నమస్తే తెలంగాణ యూనిట్ కార్యాలయం, గ్రా: చర్లపల్లి, మం: నల్లగొండ.
నల్లగొండ : 9182777626 | నల్లగొండ : 9182777635 | దేవరకొండ : 9182777635
హాలియా : 9182777059 | సూర్యాపేట : 9182777630 | భువనగిరి : 9182777638
మిర్యాలగూడ : 9182777059 | కోదాడ : 9182777630 | చౌటుప్పల్ : 9182777638

విద్యార్థులు సైన్స్‌పై పట్టు సాధించాలి

- జిల్లా గ్రంథాలయ చైర్మన్ రామారావు
- చెకుముకి పోటీల విజేతలకు బహుమతులు అందజేత

కోదాడ రూరల్: విజేతలకు బహుమతులు అందజేస్తున్న గ్రంథాలయ చైర్మన్ రామారావు

కోదాడ రూరల్, నవంబర్ 21: సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న సైన్స్‌పై విద్యార్థులు పట్టు సాధించాలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ వంగవీటి రామారావు, ఎంఈవో ఎంఏ సలీం షరీఫ్ అన్నారు. గురువారం పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో కోదాడ, అనంతగిరి మండలాల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించగా, విజేతలకు బహుమతి ప్రదానోత్సవంలో వారు పాల్గొని మాట్లాడారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవ అధ్యక్షుడు డి.ఎన్.స్వామి అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో హెచ్ఎం డీ మార్కండేయ, బడుగుల సైదులు, జానకిరామ్ పాల్గొన్నారు.

చిలుకూరు ఎంఈవో కార్యాలయంలో..

చిలుకూరు: చిలుకూరు ఎంఈవో కార్యాలయంలో చెకుముకి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు శ్రీ విష్ణు భారత్ గ్యాస్ నిర్వాహకులు కొల్లు శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు. ఎంఈవో గురవయ్య, కాంప్లెక్స్ హెచ్ఎం కరుణాకర్‌రెడ్డి, జన విజ్ఞాన వేదిక జిల్లా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.

మండల వనరుల కేంద్రంలో..

మేళ్లచెర్వు: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల వనరుల కేంద్రంలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించారు. మాజీ ఎంపీపీ కొట్టె పద్మాసైదేశ్వర్‌రావు సమకూర్చిన బహుమతులను ఎంఈవో వెంకటరెడ్డి చేతుల మీదుగా విజేతలకు అందజేశారు. ఉపాధ్యాయుడు నారపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెన్‌పహాడ్ జడ్పీహెచ్ఎస్‌లో..

పెన్‌పహాడ్: పెన్‌పహాడ్ జడ్పీహెచ్ఎస్‌లో చెకుముకి పోటీలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో రవి ప్రశంస పత్రాలు అందజేశారు.

నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో..

నేరేడుచర్ల: నేరేడుచర్ల జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన మండలస్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్ విజేతలకు ఎంఈవో సత్యనారాయణ రెడ్డి, నేరేడుచర్ల జెడ్పీహెచ్ఎస్ ఇన్‌చార్జి హెచ్ఎం సైదులు బహుమతులు ప్రదానం చేశారు.

చింతలపాలెం జడ్పీహెచ్ఎస్‌లో..

చింతలపాలెం: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో చెకుముకి టాలెంట్ పరీక్షలు నిర్వహించారు. విజేతలకు ఎంఈవో శ్రీనివాస్ బహుమతులను ప్రదానం చేశారు. తహసీల్దార్ సురేందర్‌రెడ్డి, ఎస్సై అంతిరెడ్డి, ఏవో శశాంక్, డీసీసీబీ డైరెక్టర్ రంగాచారి, మాజీ వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్ ఉన్నత పాఠశాలలో..

హుజూర్‌నగర్: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కలకుంట్ల సైదులు ఆధ్వర్యంలో చెకుముకి పోటీలు నిర్వహించారు. విజేతలకు మండల నోడల్ అధికారి బీరెల్లి శ్రీనివాసరెడ్డి ప్రశంస పత్రాలను అందజేశారు.

తుంగతుర్తి బాలుర పాఠశాలలో..

తుంగతుర్తి: మండల కేంద్రంలోని బాలుర పాఠశాలలో నిర్వహించిన చెకుముకి పోటీల విజేతలకు ఎంఈవో లింగయ్య బహుమతులు అందజేశారు. హెచ్ఎం ప్రవీణ్, చెకుముకి కన్వీనర్ ఎడ్ల గోపయ్య పాల్గొన్నారు.

తిరుమలగిరి జడ్పీహెచ్ఎస్‌లో..

తిరుమలగిరి: మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన చెకుముకి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఎంఈవో శాంతయ్య ప్రశంస పత్రాలు అందించారు. హెచ్ఎం దామెర శ్రీనివాస్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాసీల్దార్, ఎంఈవో చేతులమీదుగా..

పాలకవీడు: మండలంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు నిర్వహించిన చెకుముకి పోటీల విజేతలకు తాసీల్దార్ కమలాకర్, ఎంఈవో కాటయ్య బహుమతులు అందజేశారు. హెచ్ఎం సత్యనారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోతెలో..

మోతె: మండల కేంద్రంలో సైన్స్ టాలెంట్ టెస్టును నిర్వహించారు. గెలుపొందిన వారికి ఎంఈవో గోపాలరావు బహుమతులు అందజేశారు. హెచ్ఎం శోభాబాయ్ పాల్గొన్నారు.

రిజర్వేషన్ల దోపిడీకి అడ్డుకట్ట వేయాలి

- బీసీ హక్కుల సాధన సమితి ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు

సూర్యాపేట టౌన్, నవంబర్ 21: ఈడబ్ల్యూఎస్ పేరుతో జరుగుతున్న రిజర్వేషన్ల దోపిడీని ప్రతిఘటించాలని బీసీ హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయ నాయుడు అన్నారు. గురువారం సూర్యాపేటలో ఏర్పాటు చేసిన బీసీ హక్కుల సాధన సమితి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల అవకాశాలను ఈడబ్ల్యూఎస్ కోటా కొల్లగొడుతోందని, 4 శాతం కూడా లేని అగ్రవర్ణాలు 10 శాతం రిజర్వేషన్ అనుభవిస్తున్నారని అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల కన్నా తక్కువ మార్కులు వచ్చిన వారు ఎక్కువ ఉద్యోగాలు పొందుతున్నారని పేర్కొన్నారు. మేధావులు, విద్యార్థులు, ప్రజా సంఘాలు రిజర్వేషన్ల దోపిడీకి అడ్డుకట్ట వేసేందుకు సిద్ధం కావాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షుడు దంతాల రాంబాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, గాలి రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్మస్‌ను అధికారికంగా నిర్వహించాలి

సూర్యాపేట టౌన్, నవంబర్ 21: తెలంగాణ ప్రభుత్వం క్రిస్మస్ పండుగను అధికారికంగా నిర్వహించాలని జిల్లా పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బిషప్ దుర్గం ప్రభాకర్ అన్నారు. గురువారం పట్టణంలోని శాంతినగర్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ప్రభుత్వం క్రిస్మస్‌ను అధికారికంగా నిర్వహించడంతో పాటు ఒక్కో నియోజకవర్గానికి క్రిస్మస్ పండుగ సందర్భంగా (ఫీస్ట్) ప్రేమ విందు కార్యక్రమానికి రూ. 2 లక్షలు కేటాయించిందని గుర్తుచేశారు. ఈ సంవత్సరం కూడా రాష్ట్ర ప్రభుత్వం క్రిస్మస్‌కు ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించి అధికారికంగా నిర్వహించాలని కోరారు.

ఐఏఎల్ మహాసభలను విజయవంతం చేయాలి

మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న న్యాయవాదులు

సూర్యాపేట టౌన్, నవంబర్ 21: వరంగల్‌లో ఈ నెల 30, డిసెంబర్ 1వ తేదీల్లో నిర్వహించనున్న ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) రాష్ట్ర రెండో మహాసభలను విజయవంతం చేయాలని ఐఏఎల్ సూర్యాపేట జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొమ్మగాని శ్రీనివాస్, తొగిటి మురళి పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం జిల్లా బార్ అసోసియేషన్ హాల్‌లో ఐఏఎల్ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్‌రెడ్డి చేతులమీదుగా ఆవిష్కరింపజేసి మాట్లాడారు. దేశంలో, రాష్ట్రంలో న్యాయవాదుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఐఏఎల్ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ఐఏఎల్ గౌరవాధ్యక్షుడు నాతి సవేందర్‌కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్ల పల్లి సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డప్పు మల్లయ్య, న్యాయవాదులు బిక్షమయ్య గౌడ్, వి.వి.రావు, వేణు గోపాల్‌రావు, పెండెం వాణి, కంచర్ల సతీష్‌కుమార్, యరగాని వెంకటేశ్వర్లు, రాధాకృష్ణ, వీరేష్‌నాయక్, అనంతుల సందీప్, ఢాకా శ్రీనివాస్, డి.కిశోర్, ఏడిండ్ల అశోక్, పోలోజు మధు, సుంకరి రవి, ఎం.గోపి తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన

తుంగతుర్తి, నవంబర్ 21: మండల పరిధిలోని వెలుగుపల్లి జెడ్పీహెచ్ఎస్‌లో అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్, సువెన్ ఫార్మాస్యూటికల్ సంయుక్త ఆధ్వర్యంలో సైన్స్ ప్రయోగాలపై గురువారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో బోయిని లింగయ్య మాట్లాడుతూ.. నిత్యజీవితంలో సైన్స్ ఎంతో ప్రాధాన్యత కలిగి ఉందని తెలిపారు. అనంతరం విద్యార్థులకు మానవ శరీర భాగాలు, అవి పనిచేసే విధానాలు, వ్యాధులు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై సైన్స్ ప్రయోగాల రూపంలో వివరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఉష, సువెన్ ఫార్మాస్యూటికల్ ఏబీపీ రమేష్ బాబు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి తోడ్పాటు అందించాలి

చిలుకూరు, నవంబర్ 21: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ తోడ్పాటు అందించాలని ఆలోచన ఫౌండేషన్ చైర్మన్ ములుగురు నాగరాజు అన్నారు. గురువారం మండలంలోని ఆచార్యులగూడెం ప్రాథమిక పాఠశాలకు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.18 వేల విలువైన వాటర్ ప్యూరిఫయర్ వితరణగా అందజేసి మాటాడారు. కార్యక్రమంలో ఆచార్యులగూడెం జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం రామిరెడ్డి, ప్రాథమిక పాఠశాల హెచ్ఎం నరసింహారెడ్డి, చైర్‌పర్సన్ మైలారుశెట్టి నాగమణి, గ్రామస్తులు యలమందయ్య, గట్టు వీరయ్య, వెంకట రామనర్సయ్య, మహేష్, చిన సైదులు, వెంకన్న, అనిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

పాలకవీడు: మండలంలోని సజ్జాపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కొండా వెంకన్న ఆర్థిక సహకారంతో గురువారం విద్యా సామగ్రి అందజేశారు. పాఠశాల పూర్వ విద్యార్థి అయిన వెంకన్న తన తల్లిదండ్రులు నాంచారమ్మ, ముత్తయ్య జ్ఞాపకార్థం కుర్చీలు, పెన్నులు, నోట్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈవో కాటయ్య, హెచ్ఎం రమేష్, ఉపాధ్యాయురాలు విజయలక్ష్మి, గ్రామస్తుడు యరగొర్ల సర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా అయ్యప్ప మహా పడిపూజ



పడిపూజలో పాల్గొన్న మాలధారులు

మఠంపల్లి, నవంబర్ 21: మండల పరిధిలోని బాడవతండాలో అయ్యప్పస్వామి పడి పూజ కార్యక్రమం గురువారం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప, ఆంజనేయ, శివ మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ జగన్‌నాయక్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అమరుల త్యాగాలు వృథా కావు

తిరుమలగిరి, నవంబర్ 21: అమరుల త్యాగాలు వృథా కావని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి మండారి డేవిడ్‌కుమార్ అన్నారు. గురువారం మండల కేంద్రం తిరుమలగిరిలో నిర్వహించిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా భూమి, భుక్తి, దేశ విముక్తి కోసం అమరులైన వారికి నివాళి అర్పిస్తూ రెండు నిమిషాల సాటు మౌనం పాటించారు. ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆ సంఘం నాయకులు గంట నాగయ్య, కనుకుంట్ల సైదులు, పోలేబోయిన కిరణ్, తడకమళ్ల సంజీవ, ముగ్గిళ్ల అంజయ్య, కందుకూరి కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు అవగాహన

గరిడేపల్లి, నవంబర్ 21: గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణ, గ్రామీణ కృషి అనుభవం (రావే) కార్యక్రమాల ద్వారా పంటల సాగులో మెళకువలు తెలుసుకోవచ్చని కేవీకే శాస్త్రవేత్త ఎ.కిరణ్ అన్నారు. గురువారం మండలంలోని గడ్డిపల్లి, పొనుగోడు గ్రామాల్లో రావే కార్యక్రమంలో భాగంగా రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా వ్యవసాయ కళాశాల విద్యార్థినులు మౌలిక వసతులు, నీటి వనరులు, పంటల వివరాలపై గ్రామపటం, చిత్రాల రూపంలో రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్తలు డి.ఆదర్శ్, ఎన్.సుగంధి, రావే ప్రోగ్రాం ఇన్‌చార్జి ఎ.నరేష్, విద్యార్థినులు, రైతులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకోవాలి

కోదాడ టౌన్, నవంబర్ 21: స్థానిక కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం ఓటరు అవగాహన సదస్సు నిర్వహించారు. కోదాడ తహసీల్దార్ ఎండీ వాజీద్ అలీ హాజరై 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.గాంధీ, నాయబ్ తహసీల్దార్ అనిల్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాలొన్నారు.

మహిళా సమాఖ్య సభ్యత్వాలు నమోదు

తిరుమలగిరి, నవంబర్ 21: మండల పరిధిలోని తొండ గ్రామంలో గురువారం జాతీయ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళా సమాఖ్య సభ్యత్వాల నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లేశ్వరి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం మహలక్ష్మి పథకాన్ని ప్రతి మహిళకు వర్తింపజేయాలని అన్నారు. అదేవిధంగా మహిళలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టాలని, మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య మండల కార్యదర్శి స్వరూప, గట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

హనుమాన్ ఆలయ తృతీయ వార్షికోత్సవం

భక్తులకు ప్రవచనాలు వినిపిస్తున్న పీఠాధిపతులు

అర్వపల్లి, నవంబరు 21: తిమ్మాపురం సూర్య దేవాలయ ఆవరణలోని శ్రీరామకోటి స్థూపం, కార్యసిద్ధి వీరహనుమాన్ ఆలయ తృతీయ వార్షికోత్సవాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పీఠాధిపతులు అసంగానంద స్వామి, పరమాత్మ నందగిరి స్వామి హాజరై భక్తులకు ప్రవచనాలు వినిపించారు. వార్షికోత్సవం సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. భజనలు, హనుమాన్ చాలీసా పారాయణం జరిపారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ పీవీసీ ఎండీ మీలా మహదేవ్, జనార్దన్, స్వామి, నరేశ్, శ్రీనివాస్ భక్త బృందం సభ్యులు, భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతపై అవగాహన

పెన్‌పహాడ్, నవంబర్ 21: మల్లారెడ్డి యూనివర్సిటీకి చెందిన బీఎస్సీ అగ్రికల్చర్ విద్యార్థినులు గురువారం మండలంలోని దూపాడ్ గ్రామంలో పర్యటించారు. మహిళా సాధికారతపై గ్రామంలో అవగాహన కల్పించారు. గృహిణుల ఇంటి వద్దనే ఆదాయం పొందే అవకాశాలను వివరించారు. హోమ్ సైన్స్ శాస్త్రవేత్త ఎన్.సుగంధి పోషకాహార ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ విద్యార్థులు కె.భవాని, కె.దీలేన, కె.స్నేహ, కె.దివ్య, ఎ.గీతిక, వి.లలిత, ఎం.దుర్గ, డి.హృతిక, పి.కీర్తన పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న దామోదర్‌రెడ్డి

మఠంపల్లి, నవంబర్ 21: తెలంగాణ ప్రభుత్వం రిటైర్డ్ ఉద్యోగులకు హెల్త్‌కార్డులు మంజూరు చేయాలని రిటైర్డ్ తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గుంటకండ్ల దామోదర్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంలోని శ్రీరామచంద్ర టౌన్‌షిప్‌లో దాతల సహకారంతో రూ.15 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగుల భవనాన్ని గురువారం ప్రారంభించి మాట్లాడారు. సంఘం మండల అధ్యక్షుడు కోటయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు రావెల్ల సీతారామయ్య, జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాంబాబు, దేవదానం, మొయినుద్దీన్, భాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, స్వామి, నరసింహారావు, మాజీ సర్పంచ్‌లు మన్నెం శ్రీనివాస్‌రెడ్డి, ఆదూరి స్రవంతి తదితరులు పాల్గొన్నారు.

టెక్నికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

సూర్యాపేట అర్బన్, నవంబర్ 21: టెక్నికల్ కోర్సుల్లో ప్రవేశాలకు జిల్లాలో అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసి, అనంతరం ఆ కాపీని జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. కనీసం 7వ తరగతి పూర్తి చేసి ఉండాలని అన్నారు. డిసెంబర్ 17వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించి పరీక్షలకు హాజరు కావాలని సూచించారు. ఇతర వివరాలకు జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సంప్రదించాలని తెలిపారు.

డాటా ఎంట్రీని పరిశీలించిన ఆర్డీవో

తిరుమలగిరి, నవంబర్ 21: తిరుమలగిరిలో చేపడుతున్న ఇంటింటి సర్వే డాటా ఎంట్రీని సూర్యాపేట ఆర్డీవో వేణుమాధవ రావు గురువారం పరిశీలించారు. ఎలాంటి తప్పులకు తావివ్వకుండా వివరాలు నమోదు చేయాలని సూచించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. తాటిపాముల గ్రామంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో తహసీలార్ హరిప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలికితీయాలి

హుజూర్‌నగర్, నవంబర్ 21: జర్నలిస్టులు ప్రజా సమస్యలను వెలికి తీయడంలో కీలకపాత్ర పోషించాలని ఆర్డీవో శ్రీనివాసులు అన్నారు. హుజూర్‌నగర్ పట్టణంలో టీజేఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్‌క్లబ్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు.

ధర్నాకు కోర్టు అనుమతి ఇవ్వడం హర్షణీయం

తుంగతుర్తి, నవంబర్ 21: మహబూబాబాద్‌లో బీఆర్ఎస్ పార్టీ మహాధర్నాకు హైకోర్టు అనుమతి ఇవ్వడం హర్షణీయమని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తాటి కొండ సీతయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం కుట్ర చేసి మహాధర్నా జరగకుండా చేయాలని చూసినప్పటికీ కోర్టు అనుకూలంగా తీర్పు ఇవ్వడం ప్రభుత్వానికి ఎదురుదెబ్బ అన్నారు.

చలికాలంలో పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

నూతనకల్, నవంబర్ 21: చలికాలం నేపథ్యంలో పిల్లల్లో శ్వాస సంబంధిత సమస్యలు తలెత్తే అవకాశం ఉందని, వారి పట్ల ప్రత్యేకశ్రద్ధ వహించాలని మండల వైద్యాధికారి ఆశ్రితరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. చలికాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ప్రజలకు వివరించాలని సూచించారు. ఈ సమావేశంలో సీహెచ్‌వో చరణ్‌నాయక్, పీహెచ్ఎన్ తారమ్మ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్యుమరేటర్లు సర్వేకు రాకుంటే సమాచారమివ్వాలి

సూర్యాపేట టౌన్, నవంబర్ 21: ఇంటింటి సర్వే తుది దశకు చేరుకుందని, ఇంకా ఎవరి ఇళ్లకు అయినా ఎన్యుమరేటర్లు రాకుంటే వార్డు అధికారికి సమాచారం ఇచ్చి సర్వే చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇతర వివరాలకు 93913 26248 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శిగా సతీశ్

చివ్వెంల నవంబర్ 21: దురాజ్‌పల్లికి చెందిన చెరుకుపల్లి సతీశ్ మాదిగ ఎమ్మార్పీఎస్ జిల్లా సహాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రామ్ భవన్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ అనుబంధ సంఘాల సమావేశంలో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తన ఎన్నికకు సహకరించిన వారికి సతీశ్ కృతజ్ఞతలు ఈ సందర్భంగా తెలిపారు. సమావేశంలో నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎర్ర వీరస్వామి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రేపు కిట్స్ కళాశాలలో క్విజ్ పోటీలు

కోదాడ రూరల్, నవంబర్ 21: పాఠశాల స్థాయి విద్యార్థులకు ప్రతి ఏడాది ఢిల్లీకి చెందిన ఇంటాక్ సంస్థ నిర్వహించే వారసత్వ క్విజ్ పోటీలను ఈ నెల 23న అనంతగిరి రోడ్డులోని కిట్స్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెలంగాణ ఇంటాక్ కన్వీనర్ అనురాధ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన విద్యార్థులకు భారత దేశ చరిత్ర, సంస్కృతి అంశాలపై క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. మరిన్ని వివరాలకు 86867 17646, 87126 58966 నంబర్లను సంప్రదించాలని సూచించారు.